నేడు నారా భువనేశ్వరి రాక



(కడప-ఆంధ్రజ్యోతి): నిజం గెలవాలి పేరుతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సతీమణి నారాభువనేశ్వరి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక పలువురు మనోవేదనకు గురై మృతి చెందిన సంగతి తెలిసిందే. వారి కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం 6.30కు పోరుమామిళ్ల చేరుకుంటారు. కోటవీధి, బలిజకోటలో చంద్రబాబు అరెస్టు జీర్ణించుకోలేక మృతిచెందిన కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం బద్వేలు చేరుకుని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో రాత్రి బసచేస్తారు. శుక్రవారం ఉదయం 10.46గంటలకు బి.కోడూరు మండలంలోని గుంతపల్లె చేరుకుంటారు. అక్కడ పరామర్శిస్తారు. 11.45కు కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె, 12.30కు బ్రాహ్మణపల్లె, 1.15కు తెల్లపాడు గ్రామాల్లో పరామర్శిస్తారు.

మేమింతే..!

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడి ఐదు రోజులవుతోంది. షెడ్యూలు వెలువడిన శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఏ రాజకీయ పార్టీ అయినా సరే... నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంది. అయితే సీఎం సొంత జిల్లాలో మాత్రం కొందరు వైసీపీ నేతలు ఈసీ నిబంధనలా... అయితే మాకేంటి.. అవి మాకు వర్తించవు.. మీ రూల్స్ మీవే, మా రూల్స్ మావే.. మేమింతే అంటూ బరితెగించి నిబంధనలు ఉల్లంఘించడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడవడంపై తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది. ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సిన కొందరు ఆర్వోలు, ఇతర సిబ్బంది వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రొద్దుటూరులో ఉల్లంఘనలపై ఆంధ్రజ్యోతిలో వరుసగా కథనాలు రావడంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, వలంటీర్లు, ఇతరులపై కేసులు నమోదు చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి నిబంధనలు ఉల్లంఘించక పోయినా కేసు నమోదు చేయడం విశేషం.

- బరితెగిస్తున్న వైసీపీ నేతలు
- ఎన్నికల నిబంధనలకు మంగళం
- కమలాపురంలో వలంటీర్లతో సమావేశం
- మైలవరంలో ప్రచారంలో వలంటీర్లు
- ముద్దనూరులో దేవాలయానికి భూమిపూజలో ఎమ్మెల్యే
- జగన్ ఓడిపోతే పథకాలు బంద్ అవుతాయంటూ..
- ప్రచారం చేయాలని ప్రొద్దుటూరులో వలంటీర్లకు హుకుం
- కేసు పెట్టినా, ఉద్యోగం తీసేసినా మేమే ఆదుకుంటాం..
- డబుల్ జీతాలు ఇస్తామంటూ బంపర్ ఆఫర్
- వైసీపీకి అనుకూలంగా నడుస్తున్న కొందరు అధికారులు



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఐదేళ్లుగా వారు చెప్పిందే వేదం, వారు చెప్పిందే చట్టం, వారు చేసిందే శాసనం అన్నట్టుగా వారికి ఇష్టమొచ్చినట్లు నడుచుకున్నారు. కొందరు అధికారులు కూడా నిబంధనలు పక్కనబెట్టి వారి అడుగులకు మడుగులొత్తుతూ వచ్చారు. పవర్ పాలిటిక్స్‌కు అలవాటుపడ్డ నేతలు కోడ్ వచ్చినా కూడా మాదే రాజ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓట్ల కోసం ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదు. పోలింగ్ మే 13వ తేదీన జరగనుంది. పోలింగ్‌కు ఇంకా గడువు చాలా రోజులు ఉంది. అయినా.. ఇప్పటి నుంచే ప్రలోభాలకు తెరలేపడం, కోడ్ ఉల్లంఘించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ముద్దనూరులోని పాతవీధిలో రామాలయ నిర్మాణం భూమి పూజలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ యాదవ్, కొందరు వలంటీర్లు పాల్గొనడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇది ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడమేనని అంటున్నారు. దేవదాయ శాఖ ఏఈ విశ్వనాథరెడ్డి కూడా ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతితో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంపీడీవో మాట్లాడుతూ అక్కడకు వెళ్లి విచారించి నివేదికను కలెక్టర్లకు, ఆర్డీవోకు పంపించామన్నారు. ఇక కడపలో పోలీసుల తీరుపై ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. టీడీపీ నేతలు ప్రచారానికి జనాలను పోనీయకుండా ఆపివేస్తున్నారని.. వైసీపీ నేతలు పెద్దఎత్తున కాన్వాయితో వాహనాల్లో వెళుతున్నా పట్టించుకోవడంలేదంటూ ఆరోపించారు. ఇక్కడ పోలీసులు వైసీపీకి ఫేవర్‌గా ఉండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



ముద్దనూరులో బుధవారం ఆలయ నిర్మాణానికి జరిగిన భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

ఎన్నికల విధుల్లో వలంటీర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టరు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదంటూ ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. వలంటీర్లు 90 శాతానికి పైగా వైసీపీకి చెందిన వారే. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లు వీరంతా స్వామిభక్తి చూపుతున్నారంటారు. ప్రజల సొమ్ముతో గౌరవ వేతనం తీసుకుంటున్నామన్న స్పృహ లేకుండా వైసీపీకి మద్దతుగా ప్రచారం చేయడం విమర్శలకు తావిస్తోంది. కొంతమంది వలంటీర్లపై వేటు వేస్తున్నా తగ్గేదేలేదంటూ ప్రచారంలో పాల్గొంటూ అధికారులకే సవాల్ విసురుతున్నారని అంటున్నారు. బుధవారం కమలాపురంలో వైసీపీ నేతలు అక్షయ స్కూలు ఆవరణంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి గెలుపు కోసం అందరూ ప్రచారం చేయాలని, జగన్ సీఎం కాకపోతే మీ ఉద్యోగాలు ఉండవని హెచ్చరించారు. మీ ఊరిలోనే ఉద్యోగం ఇచ్చి మీ గౌరవం పెంచిన జగన్‌ను గెలిపించుకోవాలని హితబోధ చేసినట్లు చెబుతున్నారు. జగన్‌కు ఓటు వేయండి, జగన్ సీఎం కాకుంటే మీకు వచ్చే పథకాలు ఆగిపోతాయని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని ఆదేశించారని అంటున్నారు. వలంటీర్లతో వైసీపీ నేతలు భేటీ అయిన విషయాన్ని టీడీపీ వారు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో అక్కడకు వెళ్లేలోపు వలంటీర్లంతా జారుకున్నారు.

ప్రచారంలో వలంటీర్లు

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో ఇతర వాటిల్లో పాల్గొన వద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పదే పదే చెప్పినా కొందరు వలంటీర్లు డోంట్ కేర్ అంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. బుధవారం మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల ప్రచారంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. 11 మంది వలంటీర్లపై వేటు వేశారు.

మేం చూసుకుంటాం : వైసీపీ

ప్రొద్దుటూరు. ఈ పేరు బంగారు వ్యాపారానికి ఎంత ప్రసిద్ధో.. ఇప్పుడు జిల్లాలో కోడ్ ఉల్లంఘనటకు కూడా ప్రొద్దుటూరు అంతే ప్రసిద్ధి. ఇక్కడ ఎమ్మెల్యే రాచమల్లుదే నిన్నటిదాకా రాజ్యం. కోడ్ వచ్చినా కూడా ఆయన తన మార్కును చూపిస్తూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. ఇక్కడ కొందరు అధికారులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా ఉన్నారన్న విమర్శ ఉంది. జిల్లా ఎన్నికల అధికారి కూడా దీనిపై తల పట్టుకున్నట్లు చెబుతారు. ఇక్కడ ఓ ముఖ్య నేత బామ్మర్ది ఇటీవల వలంటీర్లతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో మీరంతా మన పార్టీ గెలుపుకోసం పనిచేయాలని, పత్రికల్లో వార్తలు వస్తాయని భయపడవద్దని, మీ మీద కేసులు వేసినా, ఉద్యోగం తీసినా మేమున్నాం అని భరోసా ఇచ్చారు. ఇప్పుడిచ్చే జీతాలకు రెట్టింపు ఇస్తాం... మీరే భయపడవద్దు, ఈ రెండు నెలలు పనిచేయండి అంటూ ఆ నేత వలంటీర్లకు హామీ ఇచ్చారని చెబుతారు. అధికార పార్టీ గెలుపు కోసం పనిచేయాలని ముఖ్యనేత బంధువే చెప్పడంతో కొందరు వలంటీర్లు ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్నారు.



రిమ్స్ మెంటల్ ఆసుపత్రిలో తొలగించని జగన్ పోస్టరు

11 మంది వలంటీర్ల తొలగింపు

మైలవరం, మార్చి 20: దొమ్మరనంద్యాల గ్రామ సచివాలయం-1 లోని 11 మంది గ్రామ వలంటీర్లు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శంషాన్ బాను బుధవారం తెలిపారు. 17వ తేదీన జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దొమ్మరనంద్యాలలో నిర్వహించిన ర్యాలీలో వలంటీర్లు ఎం.రాజేశ్, డి.నరసింహులు, ఎస్.సంజీవరాయుడు, వినయ్‌కుమార్, అమర్ శంకర్, ఒ.ఓబన్న, డి.వినయ్‌కుమార్, యు.పవన్, మోహన్‌కుమార్, శివనారాయణ, హరినాథరెడ్డి పాల్గొనడంతో పాటు ఎమ్మెల్యేతో ఫొటోలు దిగారు. దీంతో ఆర్వో ఆదేశాల మేరకు వారిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

వలంటీర్ సుబ్బారావు ఆధ్వర్యంలో చేపట్టిన వైసీపీలో చేరికలు కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, రాచమల్లు కిరణ్‌రెడ్డి



ప్రొద్దుటూరులో.. తగ్గేదేలా

- పలువురు వలంటీర్ల తొలగింపు

ప్రొద్దుటూరు, మార్చి 20: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ప్రొద్దుటూరులో మాత్రం వైసీపీ వారు మాత్రం దీనిని లెక్క చేయడం లేదు. బుధవారం పొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 38 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ ధనుంజయ్‌ని విధుల నుంచి తొలగించారు. కొత్తపల్లె పంచాయతీలోని వివేకానందనగర్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు రాచమల్లు కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీలో చేరికల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కొత్తపల్లె పంచాయతీ సచివాలయం-3, తొమ్మిదవ క్లస్టర్‌లో పనిచేస్తున్న వలంటీర్ కసాపురం సుబ్బారావు, డీలర్ జంగమయ్య ఏర్పాటు చేశారని వీరు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారిపై కేసు నమోదు చేశారు. కానీ పార్టీలో చేర్చుకోవడానికి వచ్చిన మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు రెడ్డి, రాచమల్లు కిరణ్‌రెడ్డిలపై మాత్రం కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక మున్సిపాలిటీలోని 40వవార్డులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డు వెంకటేశ్ ను కూడా ఆసుపత్రి సూపరిండెంట్ ఆనంద్‌బాబు తొలగించారు.

ఇంటికి వెళ్లి మాట్లాడినందుకు..

వరదపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

ప్రొద్దుటూరు 22 వవార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్ మహ్మదీయ కాలనీలో నివాసం ఉంటారు. ఆయన తన ఇంటికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని ఆహ్వానించారు. ఆ మేరకు ఆయన తన సోదరుడు, కుమారుడితో కలసి మహ్మద్ గౌస్ ఇంటికి వెళ్లారు. దీంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ వరదరాజులరెడ్డి, కౌన్సిలర్ మహ్మద్ గౌస్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై వరదరాజులరెడ్డి ఫ్లయింగ్‌స్క్వాడ్ హైమావతిని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని ఆమె ప్రకటించారు.



40 వవార్డు ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డు వెంకటేశ్

బుగ్గవంక 235 సర్వే నంబరులో అక్రమాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



అక్రమ లేఅవుట్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సికెదిన్నె, మార్చి 20: సీకేదిన్నె మండల పరిధిలోని ఊటుకూరులో వెలుస్తున్న అక్రమ లేఅవుట్‌పై బుధవారం 'సమయం లేదు మిత్రమా' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ సిబ్బంది దానిని ఎక్సకవేటర్‌తో తొలగించారు. ఊటుకూరు పొలంలో సర్వే నంబరు 235/2లో దాదాపు అయిదు ఎకరాలు కబ్జాకు గురైన విషయాన్ని అఖిలపక్షం నాయకులు బయటకు తేవడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో తహశీల్దారు కేపీ భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడకు వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించి బుగ్గవంకలో ఆక్రమణలు తొలగించారు.

కోడ్ ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలి

- వలంటీర్లు కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే ఉద్యోగ అర్హత కోల్పోతారు
- హెచ్చరించిన కలెక్టర్

ప్రొద్దుటూరు, మార్చి 20: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేయాలని లేకుంటే ఉల్లంఘనలకు బ్రేక్ వేయలేమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ప్రొద్దుటూరు ఆర్వో, డీఎస్పీ, కమిషనర్, తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలన్నారు. ఎన్నికల కోడ్ కింద కేసు నమోదు అయితే శాశ్వతంగా వారికి ఉద్యోగాలు రావని తెలియజెప్పాలన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కోడ్ నియంత్రణలో ఉందని కేవలం ప్రొద్దుటూరులో కోడ్ ఉల్లంఘనలు జరుగుతూ తరచు ప్రచారంలోకి వస్తోందన్నారు. అందరూ సమన్వయంగా పనిచేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ప్రొద్దుటూరులో ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప నగర శివారులో నిరుపయోగంగా ఉన్న హజ్‌హౌస్



హజ్‌హౌస్‌లో ఓ గది దుస్థితి



హజ్‌హౌస్‌ను కొవిడ్ సెంటర్‌గా ఉపయోగించిన తర్వాత మిగిలిన వస్తువులను వదిలేయడంతో అవి శిథిలమైపోయిన దృశ్యం



ఏవీ వసతులు..?

- రూ.10 కోట్లతో హజ్‌హౌస్‌లో వసతుల కల్పన..
- ఆరు నెలల క్రితం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వెల్లడి
- ఆరు నెలలు కావస్తున్నా.. టెండరు దశలోనే
- చంద్రబాబు కట్టారని.. గాలికి వదిలేశారు



నిర్వహణ లేక రంగు వెలిసి పగుళ్లు వస్తున్న గోడ

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మొదలుకుని ఆయన జమానాలో ఉన్న మంత్రులు, ఇతరులంతా చిత్తశుద్ధికి తామే బ్రాండ్ అంబాసిడర్లు అంటూ డప్పులు కొట్టుకుంటుంటారు. 2019 డిసెంబరులో జమ్మలమడుగు వద్ద ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపన సమయంలో సీఎం జగన్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే మోసం అంటారు. ఎన్నికలు అయిన ఆరు నెలలకే టెంకాయ కొడితే చిత్తశుద్ధి అంటారని చెప్పుకొచ్చారు. నాలుగున్నరేళ్లు అవుతున్నా ఉక్కు ఫ్యాక్టరీ అతీగతీ లేదు. ఇప్పుడు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కూడా హజ్‌హౌస్ వసతులపై అలాగే మాట్లాడారు.

చంద్రబాబు హయాంలో రూ.28 కోట్లతో హజ్‌హౌస్ నిర్మించారు. దాదాపు నిర్మాణమంతా పూర్తయింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం హజ్‌హౌస్‌ను గాలికి వదిలేసింది.. నాలుగున్నర సంవత్సరాల పాటు పర్యవేక్షణ లేకపోవడంతో హజ్‌హౌస్ నిరుపయోగంగా మారింది. దీనిపై టీడీపీ నేతలతో పాటు పలువురు ముస్లిం నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ వచ్చారు. టీడీపీ నేతలు సెల్ఫీ చాలెంజ్ చేశారు. దీంతో ఎన్నికల ముంగిట గత ఏడాది అక్టోబరులో రూ.10కోట్లతో వసతులు కల్పించనున్నట్లు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చెప్పుకొచ్చారు. ఆ సందర్భంగా చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. గత ఎన్నికల ముందు ఓట్ల కోసమే హజ్‌హౌస్ ప్రారంభించారని అన్నారు. తాము రూ.10కోట్లు వెచ్చించి హజ్‌హౌస్‌లో వసతులు కల్పిస్తామంటూ ఎన్నికలకు కేవలం ఆరునెలల ముందు ప్రకటించారు.

నాలుగున్నరేళ్లు వదిలేసి..

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులో హజ్‌హౌస్ ఉండేది. విభజిత రాష్ట్రంలో మక్కా వెళ్లే ముస్లింలు ఇబ్బంది పడేవారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వంలో కడప నగర శివారులోని చెన్నూరు మండలంలో 12 ఎకరాల్లో హజ్‌హౌస్ నిర్మించారు. మైనార్టీశాఖ మంత్రి అబ్దుల్‌ఫరూక్ అప్పట్లో దీనిని ప్రారంభించారు. అనంతరం కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు కట్టాడన్న నెపంతో నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్ హజ్‌హౌస్‌ను గాలికి వదిలేశారు. కరోనా సమయంలో దీనిని కొవిడ్‌సెంటరుగా ఉపయోగించుకున్నారు. జగన్ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో హజ్‌హౌస్ అద్దాలు పగలిపోయాయి. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పాడైపోయాయి. నిర్వహణ లేక లోపలంతా దుమ్ముపట్టిపోయింది. రూ.28 కోట్లతో కట్టిన హజ్‌హౌస్‌ను నిరుపయోగంగా మార్చడంపై టీడీపీ, కాంగ్రెస్, ముస్లింమైనార్టీలు నిరసన వ్యక్తం చేస్తూ వచ్చారు. అప్పటికే బీజేపీతో జగన్ సర్కారు అంటకాగుతుండడం ముస్లింలు జీర్ణించుకోలేకపోయారు. ఎన్నికలు దగ్గరకు వస్తుండడంతో మైనార్టీల్లో అసంతృప్తిని కాస్తయినా చల్లార్చేందుకు రూ.10 కోట్లతో హజ్‌హౌస్‌లో మౌలిక వసతులు కల్పిస్తామంటూ డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు.

ఇంకా టెండరు దశలోనే..

హజ్‌హౌస్‌లో ఐదు ప్యాకేజీలతో పనులు చేపడతామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో నాలుగు లిఫ్టులు, రెండో ప్యాకేజీలో థర్డ్ ఫ్లోరు నుంచి ఐదో ఫ్లోరుకు విండోస్, షట్టర్లు, డోర్లు ఏర్పాటు చేయడం... వర్షం నీరు రాకుండా రిటైల్ వాల్ నిర్మించడం చేస్తారు. మూడో ప్యాకజీలో హైవే నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణం, ఎగ్జిట్‌గేట్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు, నాలుగో ప్యాకేజీలో చుట్టూ కాంపౌండు, ఐదో ప్యాకేజీలో మొక్కలు పెంచడం.. మొత్తం పనులు ఐదు ప్యాకేజీలుగా విభజించి చేస్తామని గత అక్టోబరులో చెప్పుకొచ్చారు. ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటికింకా ప్యాకేజీ పనులు టెండరు దశలోనే ఉండడం గమనార్హం. నాలుగున్నరేళ్ల ఖాళీగా ఉండి, పటించుకోకుండా వదిలేసి చివరిలో మైనార్టీల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు హడావుడిగా పనులు చేస్తున్నట్లు విమర్శలొచ్చాయి. పోనీ ఇప్పటికైనా చేశారా అంటే టెండర్ల ప్రక్రియనే పూర్తి కాలేదు. వైసీపీ చిత్తశుద్ధి మాటలు ఇవేనా అని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.



పనిచేయని సీసీ కెమెరా



పగిలిన కిటికీ అద్దాలు



దెబ్బతిన్న వైరింగ్

వైవీయూ పరిశోధక విద్యార్థికి

రూ.30 లక్షల ఫెలోషిప్



ఫెలోషిప్ అందిస్తున్న చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20 : వైవీయూ జియాలజీ శాఖ జీఎస్టీ ఇన్‌స్పైర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రదీప్‌కుమార్‌కు భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బోర్డు నేషనల్ ఫెలోషిప్ కింద పరిశోధన కోసం రూ.30 లక్షలు ఫెలోషిప్ మంజూరు చేశారు. క్లైమెట్ ఛేంజ్, ఇంపాక్ట్ ల్యాండ్, ల్యాండ్ డిగ్రేడేషన్ అనే అంశంపై పరిశోధనలు చేయడం కోసం నేషనల్ జియోఎఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త డాక్టర్ చక్రం మార్గదర్శకంలో ఈ పరిశోధన చేయబోతున్నారు. యూనివర్శిటీలో ప్రొఫెసరు రఘుబాబు మార్గదర్శకంలో ప్రదీప్‌కుమార్ ఇది వరకే పీహెచ్‌డీ పూర్తి చేశారు. వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, జియాలజీ అధ్యాపక బృందం ప్రదీప్‌కుమార్‌ను అభినందించారు.

ఫొటోగ్రఫీలో ఏఎఫ్‌ఏయూ విద్యార్థికి బహుమతి



నగదు, ప్రశంసాపత్రం అందుకుంటున్న తేజస్విని, బహుమతి పొందిన చిత్రం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఫొటోగ్రఫీ విభాగం నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తేజస్వినికి రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి లభించింది. హైదరాబాదులో గత ఏడాది డిసెంబరులో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో కాసు బ్రహ్మానందరెడ్డి నేషనల్ పార్కు 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేబీఆర్ త్రూ కెమెరా ఐష్ అనే సీన్‌తో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో తేజస్వినిని తీసిన చిత్రానికి తృతీయ బహుమతి లభించింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎంటీ పార్గయిన్ చేతుల మీదుగా రూ.5 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యార్థి ప్రతిభ పట్ల వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ సురేంద్రనాధరెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త సంపత్‌కుమార్ తేజస్వినిని అభినందించారు.

23న కడప ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20 : కడప నగరం ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 23న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డీఎల్‌టీసీ అసిస్టెంటు డైరెక్టరు రత్నరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటీఐ చదువుతున్న విద్యార్థులు పార్ట్‌టైం కంప్యూటర్ కోర్సు మూడు నెలలు చేసిన విద్యార్థులు, డిగ్రీ, ఇంటర్ చదివిన వారు ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. సెలక్టు అయిన విద్యార్థులకు 55 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని.. నెలకు రూ.13 వేల నుంచి 22 వేల వరకు జీతం చెల్లిస్తారన్నారు. అలాగే సెలక్ట్ అయిన వారు హైదరాబాదు, బెంగళూరు, చెన్నైలలో ఉద్యోగాలు చేయాలన్నారు. అర్హత కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఐటీఐ మార్కుల జాబితా సర్టిఫికెట్లు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంటు పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రెజ్యూమ్ తీసుకుని హాజరు కావాలన్నారు

ఇద్దరిపై బైండోవర్ కేసులు

ఎర్రగుంట్ల, మార్చి 20: సోషల్ మీడియాలో ఎన్నికల కమిషన్ నియమావళికి విరుద్ధంగా పోస్టింగ్స్ పెట్టారనే విషయంపై ఇద్దరిపై బుధవారం బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తికి చెందిన వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, టీడీపీకి చెందిన కుమార్‌నాయుడు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటూ, వారి నాయకులను పేర్లను ఉటంకిస్తూ పోస్టింగ్స్ పెట్టుకున్నారని సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వారిపై తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరైనా సరే ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నడుచుకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా రాయకీయ నాయకుల అనుచరులు గ్రూప్స్‌లో పోస్టింగ్స్‌పై పోలీసు నిఘా ఉంచినట్లు సమాచారం. ప్రతి గ్రూప్ అడ్మిన్‌ను బాధ్యుడిని చేస్తూ తమ చర్యలుంటాయని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఎర్రగుంట్ల మండలంలో ఇది మొదటి నియమావళి ఉల్లంఘన కేసుగా చెబుతున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

సికెదిన్నె, మార్చి 20: ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీ కేఎల్ఎం మహిళా కళాశాలలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో తమ ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమణి తెలిపారు. ఎంబీఏ చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు ప్రముఖ కంపెనీ డేమియంరీసెర్చ్ పూణే కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తొమ్మిది మంది ఎంపికైనట్లు తెలిపారు. వారికి ట్రైనింగ్ పీరియడ్‌లో ఏడాదికి రూ.2.50 లక్షలు వేతనం ఉంటుందని, ఎంబీఏ ఉత్తీర్ణత అయిన వెంటనే కంపెనీలో జాయిన్ కావచ్చునని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఏవో కిరణ్‌కుమార్ అభినందించారు.

ఏపీపీటీడీ కార్మిక పరిషత్ కడప రీజనల్ కమిటీ రద్దు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: కడప జిల్లాలో రీజనల్ కమిటీపై పలు ఆరోపణలు రావడంతో ఆర్గనైజేషన్‌కు ఇబ్బంది కలుగుతున్నందన ప్రస్తుత రీజనల్ కమిటీని రద్దు చేసినటు ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు ఏబీజే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి కమిటీ ఏర్పాటు చేసేంతవరకు అడహక్ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. అడహక్ కమిటీలో ఏబీజేరెడ్డి, యానాదిరాజు, లచ్చన్న, రఘురాముడు, కేఆర్‌కే రెడ్డిలు ఉన్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు నియామకపత్రాలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: టీడీపీ బలోపేతానికి సంబంధించి టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు పలువురు కార్యకర్తలకు వివిధ హోదాలు కల్పిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా కత్తి రవీంద్ర, గంగవరం రాజశేఖర్‌రెడ్డి, మజ్జారి జయరాం, జిల్లా కార్యదర్శిగా బసిరెడ్డి పోల్‌రెడ్డి, నగర కోశాధికారిగా పరిటాల వెంకట్రమణయ్య, నగర ఉపాధ్యక్షులుగా పఠాన్ మన్సూర్ అలీఖాన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా గండికోట వెంకటసుబ్బయ్య, నగర్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గంపా వీరయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, మార్చి 20: ఎర్రగుంట్ల శ్రీశ్రీనగర్‌కు చెందిన పొడవుల రామక్రిష్ణ (36) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం పురుగుల మందు తాగి తన భార్యకు ఫోన్‌ద్వారా తెలిపారు. అతనిని ముందుగా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమిం చడంతో ప్రొద్దుటూరులోని జిల్లా వైద్యవిధాన్ పరిషత్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం రామక్రిష్ణ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విచారించి కేసునమోదు చేసి, గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చాపకింద నీరులా మట్కా

- డబ్బులు పోయేదే కానీ వచ్చేది మాత్రం లేదు
- ఛిద్రమవుతున్న పేదల బతుకులు
- సాంకేతికతను వాడుతున్న నిర్వాహకులు



కడప (క్రైం), మార్చి 20: వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. రోజూ కూలీ పని చేసుకుంటేనే వారికి పూట గడిచేది. కానీ ఒకే రోజులో ఈజీగా వచ్చే డబ్బుల మీద ఆశతో మట్కాను నమ్ముకుంటూ జీవితాలు బుగ్గిపాలు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మట్కా, జూదం రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. కొంత మంది పేద, మధ్యతరగతి ప్రజలను టార్గెట్ చేసుకుని మట్కా నిర్వహిస్తూ వారిని ఉచ్చులోకి దించుతున్నారు. అయితే కూలీ పనులు చేసుకునేవారే ఎక్కువగా ఈ మట్కాకు అలవాటు పడుతున్నారు. పదికి వంద, వందకు వెయ్యి చొప్పున లాభాలు వస్తాయంటూ నిర్వాహకులు చెప్పే మాటల మాయలో పడి అమాయకులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు.

టెక్నాలజీ వాడుతున్న మట్కా బీటర్లు

మట్కా బీటర్లు టెక్నాలజీని వాడుకుంటున్నారు. ఒకప్పుడు మట్కా నంబర్లు చీటీలపై రాసేవారు. ఇప్పుడు చీటీలే కాకుండా సెల్‌ఫోన్ల ద్వారా ఈ దందాను కొనసాగిస్తున్నారు. మట్కా బీటర్లు గతంలో ఏదైనా ఒకచోట ఉంటూ అక్కడికి పిలిపించుకుని చీటీలు రాయిస్తుండేవారు. సెల్‌ఫోన్లు వచ్చాక పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు వీలుగా సాంకేతికత వాడుతూ మట్కా కొనసాగిస్తున్నారు. నమ్మకం ఉన్న వారికి మట్కా నెంబర్లను వాట్సప్ మెసేజ్‌ల ద్వారా పంపిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. కడప నగరంతో పాటు పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, బద్వేలు, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.



మట్కా రాసిన వారిని పట్టుకున్న చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి (ఫైల్)

డబ్బులు పోగొట్టుకునే వారే ఎక్కువ

పదికి వంద, వందకు వెయ్యి అంటూ అత్యాశతో మట్కా ఉచ్చులో పడుతూ ఈరోజు కాకపోయినా రేపైనా గెలవచ్చనే ఆశతో ఉన్నదంతా కట్టేస్తున్నారు. దీంతో మట్కాపైన సంపాదించుకునేదానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువగా ఉంటుంది. ఈ మట్కా ఉచ్చులో పేదలే కాకుండా కొంతమంది నిరుద్యోగులు సైతం చిక్కుకుంటున్నట్లు సమాచారం. నగదు పోగొట్టుకోవడం తప్ప సంపాదించేదేమీ లేదని కొంతమంది నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అయినా సరే.. పోగొట్టుకున్న డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఈ మట్కా నెంబర్లపై డబ్బులు కాస్తూ ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. వీరి ఆశను నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మట్కాను రూపుమాపేందుకు ప్రత్యేక టీంలు ఉన్నప్పటికీ పాత నిర్వాహకులపైనే దృష్టి సారించడంతో ఆ మట్కా బీటర్లు మరికొందరి ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు పూర్తిస్థాయిలో నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

ఇటీవల నమోదైన కేసులు

- కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 1న ఉక్కాయపల్లె డంపింగ్ యార్డు వద్ద మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32,520 నగదును సీజ్ చేశారు. అలాగే జనవరి 1న పాత బైపాస్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేసి రూ.60వేల నగదు సీజ్ చేశారు. జనవరి 20న మరో ఇద్దరిని ప్రకాశ్‌నగర్ వద్ద అరెస్టు చేసి రూ.30వేలు సీజ్ చేశారు.
- ఫిబ్రవరిలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పరిధిలో ఇద్దరిని, పాత రిమ్స్ వద్ద మరో ఇద్దరిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.
- తాలూకా స్టేషన్ పరిధిలో ఫిబ్రవరిలో రవీంద్రనగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని, అలాగే టూటౌన్ పరిధిలో మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇలా జనవరి నుంచి ఇప్పటి వరకు పలు మట్కా కేసుల్లో నిర్వాహకులను అరెస్టు చేసి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. కడపతో పాటు ప్రొద్దుటూరు. మైదుకూరు ప్రాంతాల్లో కూడా మట్కా నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 20: కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర కమిషనరు ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేసుకోవాలంటే పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే జెండాలు, బ్యానర్లు, టోపీలు, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్‌లకు సంబంధించి రేటింగ్‌కార్డు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. సభలు సమావేశాలకు 48 గంటల ముందే పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు వివిధ రకాల యాప్‌ల కొరకు ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అధికారులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు తెలిస్తే వెంటనే సి-విజిల్‌లో లేదా, కమాండ్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబరు 1950 లేదా కాల్‌సెంటర్ 08562-315672కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు

ఈవీఎంల పరిశీలన

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం పరిధిలో ఉన్న ఈవీఎం గోడౌన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు నగర కమీషనరు ప్రవీణ్‌చంద్‌తో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.హరిప్రసాద్, కానుగదానం, లక్ష్మణ రావు, మల్లికార్జున, చంద్రశేఖర్ తదితరులతో పాటు ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించలేదని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చెంద్రాయుడు

మైదుకూరు రూరల్ మార్చి 20 : హుబ్లీ నుంచి క్రిష్ణపట్నంకు పోయే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా బుధవారం గడ్డంవారిపల్లె లో కొట్టి చెంద్రాయుడు అనే రైతు తన పొలానికి పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.తన పొలం రోడ్డుకు పోయినప్పటికీ అందుకు సంబంధించిన డబ్బులు రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా అడుకుంటున్నారని బోరున విలపించారు. కాగా చెంద్రాయుడు మైదుకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వీరభద్రుని ఆదాయం రూ.14 లక్షలు

చాపాడు, మార్చి 20: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామికి భక్తుల నుంచి రూ.14,07,724 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆరు హుండీలను ఆ దేవస్థానం చైర్మన్ గోసుల వెంకటసుబ్బారెడ్డి కమిటీ సభ్యులు, అధికారులు లెక్కించారు. గత ఏడాది సెప్టెంబరు 23వ తేదీ నుంచి ఈరోజు వరకు వచ్చిన డబ్బులను లెక్కించినట్లు ఈవో తెలిపారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

12 కేజీల గంజాయి స్వాధీనం
నలుగురు అరెస్ట్

మైదుకూరు రూరల్, మార్చి 20 : స్థానిక వీణావిజయరామరాజు కాలనీలో తనిఖీలు నిర్వహిస్తుండగా 12 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. మైదుకూరు సీఐ ఏపీ మస్తాన్, ఎస్ఐలు మద్దిలేటి, రాజరాజేశ్వర్‌రెడ్డి మైదుకూరులో తనిఖీలు నిర్వహిస్తుండగా వీణా విజయరామరాజు కాలనీలో ఎండు గంజాయి స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

పోలీసులకు పట్టుబడిన వారిలో గొల్లపల్లెకు చెందిన మడెం సుశ్మంత్‌కుమార్, చెన్నూర్ టౌన్ లక్ష్మీనగర్‌కు చెందిన గంధం సుబ్బరాయుడు, ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌కు చెందిన మేకల సునీల్,వీణావిజయరామరాజు కాలనీకి చెందిన సాంబరావువెంకటయ్య, మోటార్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.



విలేకరుల సమావేశంలో గంజాయి స్మగ్లర్లతో పోలీసులు

కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు

అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



పరీక్ష కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్‌తో పాటు డీఈవో ప్రకాశ్‌రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు చోటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎస్ఐ విష్ణువర్ధన్‌ను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సిబ్బందికి, పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బరితెగించి ఆక్రమణలు, ఇసుక రవాణా

- కలెక్టర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి తదితర ప్రాంతాల్లోని పెన్నానదిలో ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ శివార్లలోని జగనన్న కాలనీలో సచివాలయం ఎదురుగా, టిడ్కో గృహాలకు ఎదురుగా అధికార అండతో స్థలాలు ఆక్రమణ చేసి ఆపై నిర్మాణాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే విచారణ చేసి అనధికారికంగా చేపట్టిన కట్టడాలను పడగొట్టాలని ఆర్డీవో శ్రీనివాసులును ఆదేశించారు. అలాగే అక్రమంగా తరలిపోతున్న ఇసుక రవాణాపై మైనింగ్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని బాధితులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకల మోహన్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఈశ్వరరెడ్డి, శ్రీనివాసులు, మల్లిలతోపాటు మరికొందరు పాల్గొన్నారు.

ఓటు వేసేలా చైతన్యం తేవాలి



పోస్టరును ఆవిష్కరిస్తున్న వీసీ చింతా సుధాకర్, వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటు విలువైనదని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఆధ్వర్యంలో ఓటరు అవగాహన పోస్టర్లను రిజిస్ట్రారు ప్రొఫెసరు వెంకట సుబ్బయ్యతో కలిసి ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు వేసేలా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకులు ఓటు వేయడం బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకట్రామిరెడ్డి ప్రొఫెసరు కె.అనిత మాట్లాడారు.

వైవీయూలో ప్రపంచ అటవీ దినోత్సవం



పెయింటింగు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: వైవీయూ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ బ్లాక్‌లో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఎన్.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అడవులు లేకపోతే మానవాళి మనుగడకే ముప్పు అని.. అటవీ సంరక్షణ బాధ్యత మనందరిదన్నారు. విద్యార్థులు గీసే చిత్రాలు అడవులను పర్యావరణాన్ని రక్షించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కోటా మృత్యుంజయరావు, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రకాశ్‌బాబు

చెన్నూరు, మార్చి 20 : జరగబోయే ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమ నిబంధనలు తప్పక పాటించాలని తహసీల్దారు ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం సీఐ పార్థసారధి, ఎంపీడీవో సుదర్శనశర్మతో కలిసి రాజకీయ పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలు తప్పకుండా పాటించాలని... ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మల్లె మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య ఉత్తర్వులు మాత్రమే ఎంఈవోలకు పంపించాం : డీఈవో

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: పాఠశాల విద్య అమరావతి నుంచి వచ్చిన ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు, ఉప విద్యాశాఖాధికారులకు డీఈవో కార్యాలయం నుంచి పంపించామని డీఈవో అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై ఆమె ఖండించారు. ఈ కార్యాలయం నుంచి ఎటువంటి అక్రమ బదిలీలు జరపలేదని చెప్పారు. అటువంటి ఆరోపణలు రుజువైనట్లయితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

కమలాపురం రూరల్, మార్చి 20 : మండలంలోని పదోతరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టెన్త్ క్లాస్ విద్యార్థినీ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. కమలాపురం మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

మైదుకూరు రూరల్ మార్చి 20 : ఖాజీపేట నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మంగళవారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారుల అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ కార్‌లో అభివాదం చేస్తూ భారీగా టపాసులు పేలుస్తూ, ప్రైవేటు పాఠశాల వాహనాలను ఉపయోగించారు. అంతేగాక డీజేలతో ర్యాలీ నిర్వాహించాడని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఎల్ వెంకట రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

● తాగునీటి సమస్య పరిష్కరించలేని వారికి ఓటు అడిగే హక్కులేదు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: జిల్లాలో ఎన్నికల నియమావళి నిష్పక్షపాతంగా అమలు చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించలేని వారికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ ట్యాప్ కనెక్షన్ ఇస్తామన్నారు. బుధవారం కడప నగరం ద్వారకానగర్ టీడీపీ కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు పది వాహనాల్లో ప్రచారానికి వెళుతున్నా ఎన్నికల కోడ్ లేదని.. టీడీపీ నాయకులకు ఓట్లు అడిగేందుకు ఎన్నికల నిబంధనలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని పార్టీలకు ఒకే విధంగా నిబంధనలు వర్తింజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు అన్యాయం చేశారని.. కడప వాసిగా ఉప ముఖ్యమంత్రి నీటి సమస్యను తీర్చలేకపో యారని చెప్పారు. ప్రజలు కొన్ని రోజులుగా నీటి ఎద్దడితో అల్లాడుతున్నారన్నారు. ప్రజాసమస్యలపై ఏమాత్రం కూడా ఉప ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని మండి పడ్డారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ మంచినీటి ట్యాప్ కనెక్షన్ ఇచ్చి నిరంతరాయంగా నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మాధవీరెడ్డి మాట్లాడుతూ లలిత అనే అమ్మాయిని చంపిన పులిని పోలీసులు ఆరు నెలల్లోనే పట్టుకున్నారని. అయితే మాజీమంత్రి వైఎస్ వివేకాను హత్య చేసిన హంతకులను ఐదేళ్లు అయినా పట్టుకోలేకపోయారని చెప్పారు. నీటి కొరత తీర్చడంలో స్థానిక ఎమ్మెల్యే ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. కడప నగరంలో నీటి సమస్య మరింత జఠిలంగా మారే అవకాశం ఉందని, దీనిపై కలెక్టరు, కమిషనరు స్పందించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : పుత్తా



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, మార్చి 20: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేస్తేనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇందుకూరు, అయ్యవారిపల్లె, యలంకూరుపల్లె, సంఘాలపల్లె గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టే పథకాలను వివరించారు. తల్లికి వందనం, దీపం పథకం, అన్నదాత పథకం, యువగళం, నిరుద్యోగ భృతి తదితర పథకాలను వివరించారు. మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సంగమేశ్వర ఆలయ ఛైర్మన్ మురళీధరరెడ్డి, గంగిరెడ్డిపల్లె పోలీస్ రాజ, నాగార్జునరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఓబయ్య యాదవ్, అలిదెన సర్పంచు గోపాల్ యాదవ్, అనిమెల బాబు, ఐటీడీపీ సూరి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండలంలోని తలపనూరు గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచు శివ మారుతీరెడ్డి, సోదరుడు శివప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచు నాగిరెడ్డి, మాజీ ఉపసర్పంచు జయరాంరెడ్డి, గంగిరెడ్డి, జీపీ గంగిరెడ్డి, బాలగంగిరెడ్డితో పాటు మరో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరికి కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, తనయుడు కృష్ణచైతన్యరెడ్డిలు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సంగాలపల్లెలో బీసీకాలనీకి చెందిన పది కుటుంబాలతో పాటు తిరుమల వేణుగోపాల్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, రాఘవరెడ్డి, వీరనారాయణరెడ్డి, రామాంజనేయరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, శివనాథ్‌రెడ్డిలతో పాటు పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి పుత్తా నరసింహారెడ్డి, కృష్ణచైతన్యరెడ్డిలు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఉరుటూరు ఉపేంద్రరెడ్డి, మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఏఏకు గాయాలు

వల్లూరు, మార్చి 20: కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో తప్పెట్ల వద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (వీఏఏ) పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. సిమెంటు ట్యాంకరు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న పవన్‌ను ఢీకొన్న సంఘటనలో పవన్‌కు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. వెంటనే చికిత్స కోసం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరుకు తరలించినట్లు తెలిపారు.

ఎన్నికలపై అవగాహన

వల్లూరు, మార్చి 20: పరిధిలోని కోట్లూరు గ్రామ పంచాయతీలో ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం సాధారణ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలలో ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు, మార్చి 20: వల్లూరులో అక్రమంగా మద్యం అమ్ముతున్న సుబ్బరాయుడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. బుధవారం తమకు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇఫ్తార్ విందులో అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: కడప నగరంలో నూతనంగా నిర్మించిన మసీద్ ఏ ఫజల్‌లో టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ ఆలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు టీడీపీ నాయకుడు అమీర్‌బాబు హాజరయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ రాష్ట్రానికి సీఎం కావాలని చెప్పి ముస్లిం సోదరులందరూ ప్రత్యేక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెహ్మాన్, ఇలియాస్, నూర్‌బాషా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులివెందులలో కోడ్ ఉల్లంఘన



పులివెందులలో ఆటోకు అతికించిన సిద్ధం పోస్టర్, వాహనానికి ఉన్న మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్

పులివెందుల రూరల్, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదు రోజులు కావస్తోంది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ వచ్చారు. ఎక్కడేగాని పార్టీలకు సంబంధించి నాయకుల ఫొటోలు, ప్రచార కరపత్రాలు కనిపించకూడదని.. అది సొంత ఇంటికైనా, దుకాణానికి అయినా, సొంత స్థలంలో అయినా.. ప్రచార పోస్టర్లు ఉంటే వెంటనే తొలగించుకోవాలని ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థుల మార్గదర్శకాలు సూచిస్తూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బుక్‌లెట్‌ను ఎన్నికల కమిషన్ ప్రచురించింది. ఈ బుక్‌లెట్‌ను అన్ని రాజకీయపార్టీలకు అధికారులు అందించారు. అయితే పులివెందులలో మాత్రం వీటన్నిటిని పక్కన పెట్టిన కొందరు యథేచ్ఛగా పోస్టర్లను అతికించి తమ వాహనాలను నడుపుతున్నారు. మరోవైపు వలంటీర్లు ప్రచారాలకు దూరంగా ఉండాలని కోర్టు చెప్పినా లెక్కచేయడం లేదు. ఇలాంటి వారిపై అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతారో వేచి చూడాలి.

ఎన్నికల కోడ్ వచ్చినా అధికారుల నిర్లక్ష్యమే..!



జమ్మలమడుగు, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. కానీ జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామంలో పలు చోట్ల వైఎస్ఆర్ నవరత్నాల బొమ్మల ఫొటోలకు పేపర్ మాత్రమే అతికించి వదిలేశారు. ఎవరైనా ఆ పేపర్‌పై నీరు పోసినా, లేక రాయితో గీకినా తిరిగి జగన్ బొమ్మలు, నవరత్నాలు తెలుస్తాయి. అలాగే వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ పక్కనే పాత సచివాలయ కార్యాలయం ప్రధాన రోడ్డుకు పక్కనే గతంలో వేసిన సీఎం జగన్ ఫొటో ఇంటింటికి వచ్చే వంటింటి వ్యర్థాల నిలువకు సరైన పరిష్కారం కంపోస్టు గుంతలు అనే రంగులు వేసిన బొమ్మలు ప్రదర్శనగా ఉన్నాయి. అలాగే గ్రామంలోని పలు చోట్ల దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే అధికారులు నవరత్నాలు, జగన్ బొమ్మలు కలిగిన ఫొటోలకు పేపర్లు మాత్రమే అతికించి వదిలేశారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడండి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

కడప (నాగరాజుపేట), మార్చి 20: కడప నగర పరిధిలో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని.. వాటిని కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం రాష్ట్ర కన్వీనర్ కారు ఆంజనేయులు డిమాండ్ చేశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం రోజు రోజుకూ విస్తరిస్తున్నదని, అలాగే స్థలాల ధరలు కూడా పెరిగి పోవడంతో భూకబ్జాదారులు వాగులు, వంకలను ఇష్టం వచ్చినట్లు ఆక్రమిస్తున్నారన్నారు. ప్రస్తుతం సీకేదిన్నె మండలంలోని రెవెన్యూ సర్వే నెం.235/2లో 42.75 ఎకరాల బుగ్గవంక భూమి ఉండగా.. 36.95 ఎకరాల భూమి మాత్రమే కనబడుతుందని, ఐదు ఎకరాల పై చిలుకు భూమి కబ్జాకు గురైనట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న రైల్వే పంపుసెట్టును కూడా పగలొగట్టి కబ్జాదారులు వెంచర్లు కూడా వేశారని ఆరోపించారు. తక్షణం అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నగిలి గురప్ప, చేతివృత్తుల జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున, రైతు స్వరాజ్య వేదిక పుత్తా శివారెడ్డి, దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనరు దేవరక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కేసులు : జేసీ



కమలాపురం రూరల్, మార్చి 20 : దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని.. ఏ కార్యక్రమం చేపట్టాలన్నా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయ నాయకులు అనుమతి లేకుండా ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలా చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను అనుసరించి అందుకు లోబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



దర్బార్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న డ్రైవర్లు

వేంపల్లె, మార్చి 20: సుమో స్టాండ్ ఆధ్వర్యంలో షేక్ దర్బార్ (డ్రైవర్) కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న దర్బార్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి తమ వంతుగా సాయం చేయాలని డ్రైవర్లంతా కలిసి డబ్బును సేకరించి వేంపల్లె వైఎస్సార్ సుమో స్టాండ్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ముత్యాల అంజి తదితరులు పాల్గొన్నారు.

'27 నుంచి మేమంతా సిద్ధం కార్యక్రమం'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: మేమంతా సిద్ధం కార్యక్రమం ఈ నెల 27 నుంచి నిర్వహిస్తున్నట్టు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం ఆదిత్య కల్యాణ మండపంలో 'మేమంతా సిద్ధం' సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఈ నెల 27 నుంచి మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 27న ఇడుపులపాయలో దివంగత సీఎం వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తారని అనంతరం ప్రొద్దుటూరులో మేమంతా సిద్ధం మొదటి సభ నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా మేమంతా సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు.

ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించిన కలెక్టర్



బాలికల జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ విజయరామరాజు బుధవారం సందర్శించారు. అక్కడ కళాశాల ఆవరణంలో ఏర్పాట్లు చేస్తున్న స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం జమ్మలమడుగు ఆర్వో శ్రీనివాసులతో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లు చకచకగా జరగాలని సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసులు, ఎంసీసీ నోడల్ అధికారి సూర్యసాయిప్రవీణ్‌చంద్, తహసీల్దారు కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఆర్ఐ రోహిత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బొలేరో, స్కూటర్ ఢీ : ఒకరికి గాయాలు

ఖాజీపేట, మార్చి 20: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె చెరువు సమీపంలో బొలేరో, స్కూటర్ ఢీకొనడంతో సోమదాసుకు గాయాలు అయ్యాయి. రావులపల్లెకు చెందిన సోమదాసు పనినిమిత్తం ఖాజీపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు క్రాస్ అవుతున్న స్కూటర్‌ను వెనుకపక్క నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

సాయుధ బలగాలతో కవాతు

జమ్మలమడుగు, మార్చి 20: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. బుధవారం జమ్మలమడుగులోని మోరగుడి, గూడెం చెరువు, నాగులకట్ట, తదితర ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, ప్రొబెషనరీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో రహస్య సమావేశాలు?

● వైసీపీ కోసం విస్తృతంగా ప్రచారం చేయండి ● ఎన్నికల తరువాత మరింత లబ్ధి అందిస్తాం



చెన్నూరు, మార్చి 20: మండల వ్యాప్తంగా వలంటీర్లతో వైసీపీ నేతలు రహస్య సమావేశం నిర్వహిస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీలలోని వలంటీర్లను పిలిపించడం, అధికారులకు తెలియకుండా రహస్య గదిలో అందరినీ కూర్చోబెట్టుకుని వైసీపీకి ప్రచారం చేయండి, ఆ పార్టీ గెలుపునకు కృషి చేస్తే మీ సేవలకు తగ్గ ఫలితం ఉంటుందని వారికి నూరిపోస్తున్నారు. గత రెండు రోజులుగా కొందరు వలంటీర్లకు మండల వైసీపీ నేతలు సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. వలంటీర్లతో రాజకీయపరంగా సమావేశం నిర్వహించినా.. వారి సేవలు వినియోగించుకున్నా.. ఎన్నికల నియమావళికి విరుద్ధం కాబట్టి ఎవరికీ తెలియకుండా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పైగా ఇటీవల పలువురు వైసీపీ నేతలు టీడీపీ సానుభూతిపరులుగా మారి ఆ పార్టీకి మద్దతు తెలుపుతుండడంతో ఈ విషయం టీడీపీ నేతలకు తెలిసి వారి ద్వారా ఎక్కడ ఎన్నికల కమిటీ దృష్టికి తీసుకుపోతారో అనే భయంతో ఏ మాత్రం గుట్టుచప్పుడు కాకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ముందుగానే చర్చించి ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య సమావేశం పెట్టుకోవాలంటే.. ఒక గంట ముందుగానే వాలంటీర్లకు సమాచారం ఇచ్చి పిలిపించుకోవడం జరుగుతుంది. కాగా వలంటీర్లతో నిర్వహించే సమావేశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఈసీ ఆదేశాల మేరకు ఇలాంటి సమావేశాలను నిలువరించాల్సిన పరిస్థితి మండల ఎన్నికల అధికారులపై ఉంది.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి


బ్రహ్మారెడ్డి, క్రిష్ణ, ఆర్ఆర్ వర్మ

బద్వేలు రూరల్, మార్చి 20 : బద్వేలు కోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా, టీఏ క్రిష్ణ వైస్ ప్రెసిడెంటు, ఆర్ఆర్ వర్మ జనరల్ సెక్రటరీలుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఉండ్ర మురళీక్రిష్ణ తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను నిర్వహించిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో వీరు కాకుండా జనరల్ సెక్రటరీగా నూతి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీగా రమణా రెడ్డి, ట్రెజరర్‌గా టీజే ప్రభాకర్, లైబ్రరీ సెక్రటరీగా సురేష్‌బాబు తదిత రులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు అందరి సహకారంతో ముందుకు వెళతామన్నారు.

టీడీపీని గెలిపించండి


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో జ్యోతి, సరస్వతి

జమ్మలమడుగు, మార్చి 20: టీడీపీని గెలిపించండని టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి పేర్కొన్నారు. జమ్మలమడుగు పట్టణంలో బుధవారం సాయంత్రం 1వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు భాగ్యమ్మ, దేవమ్మ, నూర్జహాన్, రసూల, మాబున్ని, కౌసర్, రజియా, జరీనా, మరియమ్మ, అన్వర్‌బాష, నజీర్, గౌస్‌మొద్దీన్, మున్నా, హుస్సేన్‌పీర్, దస్తగిరి, గైబూసా, నాగూర్, గైబూవలి, ఖాదర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చినా అధికారుల నిర్లక్ష్యమే..!



గొరిగెనూరులో పాత సచివాలయ భవనం గోడకు తొలగించని జగన్ ఫొటో

జమ్మలమడుగు, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. కానీ జమ్మలమడుగు మండలంలోని గొరిగెనూరు గ్రామంలో పలు చోట్ల వైఎస్ఆర్ నవరత్నాల బొమ్మల ఫొటోలకు పేపర్ మాత్రమే అతికించి వదిలేశారు. ఎవరైనా ఆ పేపర్‌పై నీరు పోసినా, లేక రాయితో గీకినా తిరిగి జగన్ బొమ్మలు, నవరత్నాలు తెలుస్తాయి. అలాగే వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ పక్కనే పాత సచివాలయ కార్యాలయం ప్రధాన రోడ్డుకు పక్కనే గతంలో వేసిన సీఎం జగన్ ఫొటో ఇంటింటికి వచ్చే వంటింటి వ్యర్థాల నిలువకు సరైన పరిష్కారం కంపోస్టు గుంతలు అనే రంగులు వేసిన బొమ్మలు ప్రదర్శనగా ఉన్నాయి. అలాగే గ్రామంలోని పలు చోట్ల దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే అధికారులు నవరత్నాలు, జగన్ బొమ్మలు కలిగిన ఫొటోలకు పేపర్లు మాత్రమే అతికించి వదిలేశారు.

జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్టులోకి పూజా ఇంటర్నేషనల్ స్కూల్


మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్‌స్వామి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 20: పూజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉత్తమ విద్యను అందిస్తామని త్రిదండి చినజీయర్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం పాఠశాల వ్యవస్థాపకుడు రాజారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాడీహోం రాజారెడ్డి సేవాభావం ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు.కాగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టులోకి పాఠశాలను తీసుకున్నామని, పాఠశాల నిర్వహణకు బుశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తామని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గొర్రె శ్రీనివాసులు, విశ్వచింతన్‌స్వామి, కిరణ్మయి, జొన్నలగడ్డ రవీంద్రబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ విల్సన్‌జాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు



మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

మైదుకూరు రూరల్ మార్చి 20 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, ఒక్కసారి తనను గెలిపించండి అని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు.స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెలో మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి,వార్డు కౌన్సిలర్ పోట్లదుర్తి వెంకటేశ్వర్లు, పొలిమేర శివశంకర్‌రెడ్డి,పొలిమేర రాజగోపాల్‌రెడ్డి,రవీంద్రారెడ్డి,లతో పాటు వంద కుటుంబాలు పుట్టా సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర,కృష్ణమూర్తి,చాపాడు మాజీ ఎంపీపీ గురివిరెడ్డి,కటారి వీరన్న,బీపీ సుధాకర్,రామచంద్రనాయుడు, లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది బీఎన్ శ్రీనివాసులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాసులు.కొండపల్లి ఉమాకాంత్, ప్రొద్దుటూరు మునెయ్య, శివమోహన్‌రెడ్డి, యాపరాల చిన్న,బురగోళ్ళ చిన్న తదితరుల పాల్గొన్నారు.

దువ్వూరు(మైదుకూరు రూరల్)..: టీడీపీ గెలుపుకోసం కృషి చేసే వారికి సముచిత న్యాయం చేస్తామని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు.మండలంలోని చిన్నశింగనపల్లె పంచాయతీలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన బి.రామగోపాల్ రెడ్డి,బ్రహ్మానందరెడ్డి, మోహన్‌రెడ్డి, పులిలక్ష్మీరెడ్డి,వెంకట రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి,ఆంజినేయులరెడ్డి, నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి,వరదారెడ్డి,చిన్న ఓబులేసు,పెద్దఓబులేసు, వీరారెడ్డి,ప్రతాప్‌రెడ్డిలతో పాటు మరో 40 కుటుంబాలు పుట్టా సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, సంజీవరెడ్డి,రాంబాబు,పొలిమేరరవీంద్రనాథ్‌రెడ్డి,క్రిష్టారెడ్డి,రామలక్ష్మీరెడ్డి, పాల్గొన్నారు.

ఖాజీపేట..: మండల పరిధిలోని పుల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన యువకులు టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో రాజు, సుధాకర్, శేఖర్, గంగాధర్, విజయ్, ఉపేంద్ర, మరికొందరు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ పుట్టా గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, సుబ్బయ్య, పల్లె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఎత్తులు, జిత్తులు వేసినా రాచమల్లు ఓటమి తథ్యం : వరద

ప్రొద్దుటూరు , మార్చి 20 : ప్రొద్దుటూరులో ఎన్ని ఎత్తులు జిత్తులు వేసినా రాచమల్లు ఓటమి తథ్యమని ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోపవరం పంచాయతీ కాల్వ కట్ట వద్ద వరదరాజులరెడ్డి, రాఘవరెడ్డి, కొండారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నాయకుడు పొట్టులక్ష్మీరెడ్డిటీడీపీలో చేరారు. వరదరాజులరెడ్డి లక్ష్మీరెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వందలాది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

22 వార్డు కౌన్సిలర్ గౌస్ చేరిక : 22 వవార్డు కౌన్సిలర్ వైఎస్ మహ్మద్ గౌస్ బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని మహ్మదీయకాలనీలోని తన స్వగృహనికి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన వరదరాజులరెడ్డితో కలిసి వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మహ్మద్‌గౌస్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ మున్నా తదితరులు ఉన్నారు.

రేపు నారా భువనేశ్వరి బి.కోడూరు రాక

బి.కోడూరు, మార్చి 20: మండల పరిధిలోని గుంతపల్లె గ్రామానికి నిజంగెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి శుక్రవారం ఉదయం 10గంటలకు బీకోడూరుకు రానున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు జరిగినరోజు గవిరెడ్డి ఓబుల్‌రెడ్డి (45) టీవీ చూస్తూ గుండెపోటు వచ్చి అక్కడికక్కడే చనిపోయాడు. ఆ కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించి వారికి సాయం చేసేందుకు వస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

రేపటినుంచి కోట పోలేరమ్మ తిరుణాల

పోరుమామిళ్ల, మార్చి 20 : పోరుమామిళ్లలోని రంపాడు వీధిలో ఉన్న కోట పోలేరమ్మ దేవాలయంలో ఈ నెల 22 నుంచి తిరుణాల ఉత్సవాలు జరుగుతున్నట్లు ఆ దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. 22న ఉదయం చల్లన్నంతో భక్తులు పూజలు నిర్వహిస్తారన్నారు. 24న అమ్మవారికి కుంకుమబండ్లతో ఊరేగింపు నిర్వహించి పూజలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి సయ్యద్‌షా రఫివుల్లాషా ఖాద్రీ ఉరుసు

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగులోని పలగాడివీధిలో వెలసిన తూగుట్లపల్లె జాగీర్దార్ సయ్యద్‌షా రఫివుల్లాషా ఖాద్రీ ఉరుసు మహోత్సవ కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా బుధవారం నిషాన్‌తో ప్రారంభమైంది. 21న గంధం, 22న ఉరుసు, 23న జియారత్ కార్యక్రమాలతో ముగుస్తాయి. గురువారం రాత్రి 10 గంటలకు నగారాలతో, పకీర్ల మేళాలతో స్వామివారి పూలచాందినిని ఊరేగిస్తామన్నారు. అందులో భాగంగా దర్గా ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం అనుసరించాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 20: రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరించాలని ఏరువాక కేంద్రం డైరెక్టర్ అంకన్న కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉప్పరపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో ఆచార్య ఎన్జీరంగ విశ్వవిద్యాలయం, ఊటుకూరు ఏరువాక కేంద్రం సహకారంతో రైతులకు వరి, పత్తిపంటలో సాంప్రదాయ పద్ధతులు, సస్యరక్షణ, డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ,ఎఫ్‌పీవో సీఈవో వీరమోహన్ ,ఊటుకూరు ఏఆర్ఎస్ కేంద్రం డైరెక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ రాంబాబు, ఉప్పరపల్లె సర్పంచ్ రమణారెడ్డి, రైతులు, ఎఫ్‌పీవో సంఘాల చైర్మన్లు, పాలక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొలేరో, స్కూటర్ ఢీ : ఒకరికి గాయాలు

ఖాజీపేట, మార్చి 20: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె చెరువు సమీపంలో బొలోరో, స్కూటర్ ఢీకొనడంతో సోమదాసుకు గాయాలు అయ్యాయి. రావులపల్లెకు చెందిన సోమదాసు పనినిమిత్తం ఖాజీపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు క్రాస్ అవుతున్న స్కూటర్‌ను వెనుకపక్క నుంచి వస్తున్న బొలోరో వాహనం ఢీకొనడంతో గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

సారా స్వాధీనం

బి.కోడూరు, మార్చి 20 : మండల పరిధిలోని అంకన గొడుగునూరు గ్రామానికి చెందిన దట్టం సుబ్బయ్య మూడు లీటర్ల సారాయి తన ఇంటిలో ఉంచుకుని అమ్ముతుండగా ఎక్సైజ్ సీఐ మంజుల తన సిబ్బందితో దాడులు చేసి సారా స్వాధీనం చేసుకున్నారు. కాగా బుధవారం ఎక్సైజ్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించడంతో అతన్ని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు.

సాయుధ బలగాలతో కవాతు

జమ్మలమడుగు, మార్చి 20: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. బుధవారం జమ్మలమడుగులోని మోరగుడి, గూడెం చెరువు, నాగులకట్ట, తదితర ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, ప్రొబెసనరీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

ఖాజీపేట, మార్చి 20: మండల పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల అధ్యక్షుడు సిద్ధిక్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉందని, మండల పరిధిలో ఎక్కడైనా ఫ్లెక్సీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచులు, జడ్పీటీసీ కోఆప్షన్ మెంబర్ అచ్చుకట్ల కరీముల్లా , కోఆప్షన్ మెంబర్ మున్వర్, అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

పోరుమామిళ్ల, మార్చి 20 : ఈ సారి జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతంపెరిగేలా చూడాలని తహసీల్దారు శిరీషా అన్నారు. బుధవారం స్త్రీ శక్తి భవన్‌లో సార్వత్రిక ఎన్నికలపై సెక్టారు అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్‌కాండక్ట్ అమల్లోకి వ చ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్‌రావు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి , మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

మైదుకూరు రూరల్ మార్చి 20 : ఖాజీపేట నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మంగళవారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారుల అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ కార్‌లో అభివాదం చేస్తూ భారీగా టపాసులు పేలుస్తూ, ప్రైవేటు పాఠశాల వాహనాలను ఉపయోగించారు. అంతేగాక డీజేలతో ర్యాలీ నిర్వాహించాడని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఎల్ వెంకట రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు.

15 బీరు బాటిళ్లు స్వాధీనం


కొండాపురం ,మార్చి 20: మండలంలోని సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద 15 బీరు బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన జయన్న అనే వ్యక్తి 15 బీరు బాటిళ్లను అనుమతి లేకుండా తీసుకెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించిన కలెక్టర్


బాలికల జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ విజయరామరాజు బుధవారం సందర్శించారు. అక్కడ కళాశాల ఆవరణంలో ఏర్పాట్లు చేస్తున్న స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం జమ్మలమడుగు ఆర్వో శ్రీనివాసులతో మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లు చకచకగా జరగాలని సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్వో శ్రీనివాసులు, ఎంసీసీ నోడల్ అధికారి సూర్యసాయిప్రవీణ్‌చంద్, తహసీల్దారు కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఆర్ఐ రోహిత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 20: ఎర్రగుంట్లనగరపంచాయతీలోని పద్మావతి పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకం, అనంతరం విశేష అలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు శ్రీదేవిశ్రీభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి శాస్త్రోక్తంగా అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు రామాంజినేయులు, ఇతర కమిటి సభ్యులు, భక్తులు పెద్దఎత్తున పూజలో పాల్గొన్నారు. స్వామి ప్రసాదాలతోపాటు, ముత్యాల తలం బ్రాలు, భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశా రు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని గ్రామోత్సవం నిర్వహిం చారు. పురవీధుల్లో భక్తులు స్వామికి టెంకాయ కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ఆర్డీవో

జమ్మలమడుగు, మార్చి 20: ఎన్నికల సాకును చూపి ప్రజా సమస్యలను ఆర్డీవో శ్రీనివాసులు గాలికి వదిలేసినట్లు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు ప్రజలు వివిధ సమస్యలపై ఆర్డీవో శ్రీనివాసుల వద్దకు వస్తే వాటిని పట్టించుకోవడంలేదన్నారు.

రెవెన్యూ నిర్లక్ష్యంతోనే

నేటి భూపోరాటాలు


బద్వేలు రూరల్, మార్చి 20 : అన్యాక్రాంత భూములు కాపాడడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైన కారణంగానే భూపోరాటాలు చేయవలసి వస్తోందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్ అన్నారు. బుధవారం జేవీ భవన్‌లో పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేల ఎకరాలు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు కాపాడలేని రెవెన్యూ యంత్రాంగం పేదలపై పెత్తనం చెలాయించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు రమణ, మునిరత్నం, శేఖర్, ఉదయ్, రవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

10 మంది పై కేసు నమోదు

కొండాపురం, మార్చి 20 పట్టణంలో పాతకక్షలతో గొడవపడిన సంఘటనలో పోలీసులు 10 మంది యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.బైక్ విషయంలో షేక్షావలి,జమీర్ ఇద్దరు మంగళవారం రాత్రి పట్టణంలోని ఓ టీ బంకు వద్ద ఘర్షణ పడ్డారు.ఈ సంఘటనలో వీరిద్దరితో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.ఎవరైనా అనవసరంగా లేనిపోని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

శేషవాహనంపై వేంకటేశ్వరుడు



బద్వేలు రూరల్, మార్చి 20 : మండలపరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వెంటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శేష వాహనంపై వెంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 19 నుంచి 29 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల గదుల ఏర్పాటు


గదులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు, మార్చి 20: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సర్వేభవన్ వద్ద ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం సర్వే భవన్ వద్ద అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తదితర అధికారులకు ఈ భవనం కేటాయించారు. ఏర్పాట్లలో భాగంగా చిన్న చిన్న ఫ్లెక్సీలను గోడలకు అతికించారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రపంచ అటవీ దినోత్సవం


పెయింటింగు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: వైవీయూ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ బ్లాక్‌లో విద్యార్థు లకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎన్ఎస్ ఎస్ సమన్వయకర్త ఎన్.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అడవులు లేకపోతే మానవాళి మనుగడకే ముప్పు అని.. అటవీ సంరక్షణ బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కోటా మృత్యుంజయరావు, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాల విద్య ఉత్తర్వులు మాత్రమే ఎంఈవోలకు పంపించాం : డీఈవో

కడప (ఎడ్యుకేషన్), మార్చి 20: పాఠశాల విద్య అమరావతి నుంచి వచ్చిన ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు, ఉప విద్యాశాఖాధికారులకు డీఈవో కార్యా లయం నుంచి పంపించామని డీఈవో అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై ఆమె ఖండించారు. ఈ కార్యాలయం నుంచి ఎటువంటి అక్రమ బదిలీలు జరపలేదని చెప్పారు. అటువంటి ఆరోపణలు రుజువైనట్ల యితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.